క్లుప్తంగా

నేడు 'డయల్ యువర్ డీఎం'

మణుగూరురూరల్: తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ మణుగూరు డిపో ఆధ్వర్యంలో ఈ నెల 28న శుక్రవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ శ్యాంసుందర్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. నేటి సాయంత్రం 3గంటల నుండి 4గంటల వరకు ఈ కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. డిపో పరిధిలోని మణుగూరు, పినపాక, కరకగూడెం, అశ్వాపురం తదితర మండలాల్లోని గ్రామాల ప్రజలు బస్సు రాకపోకల సమయాల్లో, ఇతర సమస్యలు ఏమైనా ఉంటే డయల్ యువర్ కార్యక్రమం ద్వారా 9959225963 ఫోన్ నంబర్‌కు సంప్రదించి సూచనలు, సలహాలు ఇవ్వాలని తెలిపారు.

సంత వేలం..

దమ్మపేట: మండల కేంద్రం, దమ్మపేట మేజర్ గ్రామ పంచాయితీ పరిధిలోని సంత వేలం పాటను నేడు(శుక్రవారం) గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్లుగా ఎంపీఓ రామారావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. సంత వేలం పాటలో పాల్గొనాలనుకున్న వారు ముందుగా రూ.5,000ల డిపాజిట్‌ను చెల్లించాలని తెలిపారు. వేలం పాటలో ఆశించిన ధర పలకకపోతే వేలాన్ని రద్దుపరిచే అధికారం గ్రామ పంచాయతీకి ఉందని తెలియజేశారు.

జాతర ప్రారంభం

అశ్వారావుపేటరూరల్: మండల పరిధిలోని వినాయకపురం గ్రామ శివారులో ఉన్న చిలకల గండి ముత్యాలమ్మ తల్లి ఆలయం వద్ద గురువారం నుంచి వార్షిక జాతర ప్రారంభమైంయి. తెల్లవారుజామున ఆలయంలో అర్చకుల విఘ్నేశ్వర పూజలతో ఉత్సవాలు ప్రారంభమవగా.. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. తొలి రోజు అమ్మవారు మహాలక్ష్మి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు దర్శించుకుని నైవేద్యాలు సమర్పించారు. ఐదు రోజులపాటు జరిగే ఈ ఉత్సవాలకు పలు ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలిరానున్నారు.

విద్యార్థులకు భోజనం

మణుగూరుటౌన్: బండారుగూడెం ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థిని విద్యార్థులకు ఉపాధ్యాయుడు నిట్టా రాంబాబు జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు గురువారం భోజనం, వాటర్‌బాటిల్స్ అందజేశారు. ఈ కార్యక్రమాన్ని ఎంఈఓ స్వర్ణజ్యోతి, టీఎస్ యూటీఎఫ్ మణుగూరు మండల ప్రధాన కార్యదర్శి షేక్ మీరాహుస్సేన్‌లు అతిథులుగా హాజరై కుటుంబసభ్యులు నిట్టా సుజాత, ప్రియ, ప్రణయలను అభినందించారు. కార్యక్రమంలో టీఎస్ యూటీఎఫ్ మణుగూరు మండల అధ్యక్షుడు బొల్లు ఐలయ్య, యాక్షన్ ఫర్ ఇంటిగ్రేట్ డెవలప్‌మెంట్ ప్రతినిధి నాగుల జ్యోతి, స్కూల్ హెచ్‌ఎం సావిత్రి స్కూల్ టీచర్స్ రామారావు, సరస్వి, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

పుస్తకావిష్కరణ

అశ్వారావుపేటరూరల్: స్థానిక షిరిడీ సాయిబాబా ఆలయంలో గురువారం అశ్వారావుపేటకు చెందిన కవి, రచయిత డాక్టర్ సిద్ధాంతపు ప్రభాకరాచార్యులు రచించిన శ్రీ సాయినాథుడు పుస్తకాన్ని ఘనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రచయిత మాట్లాడుతూ.. సబ్ కా మాలిక్ ఏక్ హై అని నినదించిన సద్గురువు సాయినాథుని దివ్యతత్వాన్ని పది మందికి పంచాలనే ఉద్దేశంతో శతాధిక సాయి మొగ్గలను రచించి పుస్తక రూపంలోకి తెచ్చాన్నారు. అనంతరం పుస్తక రచయితను ఆలయ కమిటీ సభ్యులంతా కలిసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సేవా సమితి బాధ్యులు పంబి హరి, టి.అప్పారావు, ఎల్.కృష్ణారెడ్డి, నాగ బాబు, ముళ్లపూడి సూరిబాబు, విమల శ్రీదేవి, జ్యోతి, గౌరి పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

చర్ల: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలను రైతులు మరింతగా సద్వినియోగం చేసుకోవాలని చర్ల సహకార సంఘం అధ్యక్షుడు పరుచూరి రవికుమార్ అన్నారు. గురువారం చర్లలోని సహకార సంఘ ఆవరణలో సంఘం మహాజన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో సంఘం పరిధిలోని 100 మంది రైతులకు పంట సాగు కోసం రూ.65 లక్షలను రుణాలుగా అందజేసినట్లు ఆయన తెలిపారు. సంఘం ద్వారా రైతులకు బంగారు ఆభరణాలపై కూడా పంట రుణాలను ఇచ్చేందుకు సిద్ధం చేసినట్లు ఆయన చెప్పారు. సమావేశంలో సహకార సంఘం సీఈఐ ఎస్‌డి.జిలానీ, సంఘ డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.

ఆలయంలో అన్నదానం

మణుగూరురూరల్: మండలంలోని సాయినగర్‌లో ఉన్న షిరిడి సాయిబాబా ఆలయంలో గురువారం సందర్భంగా సాయినాథుడికి ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం సాయిసేవకుల ఆధ్వర్యంలో ఆలయ ప్రాంగణంలో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేయగా.. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అన్నప్రసాదాలను స్వీకరించారు. అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన సాయి సేవలకు ఆలయ కమిటి సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు దోసపాటి నాగేశ్వరరావు, సీహెచ్.బాలకేశవరావు, అర్చకులు పవన్ కుమార్ వర్మ, గుమస్తా వెంకన్న, సాయి సేవకులు, భక్తులు పాల్గొన్నారు.

ఈ రహదారి బాగుపడేనా..?

ఛిద్రమైన బూర్గంపాడు- సారపాక ఆర్‌అండ్‌బీ రోడ్డు

- అడుగుకో గుంత-ప్రయాణానికి చింత

నిత్యం వేలాది వాహనాలు నడిచే ఆర్‌అండ్‌బీ రహదారి ప్రయాణానికి ఇబ్బందికరంగా మారింది. గోదావరి వరదలతో 2022లో బూర్గంపాడు-సారపాక రహదారి పూర్తిగా దెబ్బతింది. పలుచోట్ల పూర్తిగా కొట్టుకుపోయింది. గోతులతో ప్రయాణం నరకప్రాయంగా మారింది. వాహనదారులు, స్థానికులు ఈ రహదారి దుస్థితిపై పలుమార్లు అధికారులకు, ప్రజాప్రతినిధులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండా పోయింది.



గోతులమయంగా మారిన బూర్గంపాడు-సారపాక ఆర్‌అండ్‌బీ రహదారి

బూర్గంపాడు: బూర్గంపాడు-సారపాక రహదారి గుంతలమయమైంది. ఈ దారిలో ఐదు కిలోమీటర్ల ప్రయాణానికి 20 నిమిషాలు పడుతుంది. ఆర్‌అండ్‌బీ అధికారులు మాత్రం ఏడాదికి ఒకసారి గోతుల్లో మట్టిపోసి మమ అనిపిస్తున్నారు. ఆ మట్టి మూడురోజులకే కొట్టుకుపోయి ఎప్పటిమాదిరిగానే మారుతోంది. కనీసం గోతుల్లో కంకర పోసి తారు పోస్తే కొంతమేరా ఇబ్బందులు తొలుగుతాయి.

ప్రమాదాలకు నిలయంగా..

ఈ రహదారిలో ఆర్టీసీ బస్సులతో పాటుగా దూర ప్రాంతాలకు సరుకు రవాణా చేసే లారీలు, భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. అధిక లోడుతో వచ్చే భారీ వాహనాలు గోతుల్లో పడి మరమ్మతులకు గురవుతున్నాయి. గోతులను తప్పించే క్రమంలో వాహనాలు ప్రమాదాలకు గురవుతున్నాయి. తరచు ప్రమాదాలు జరిగి పలువురు గాయాలపాలవుతున్నారు. ఈ రహదారిలో జరిగిన ప్రమాదాలలో మూడేళ్ల వ్యవధిలో ముగ్గురు ప్రాణాలు కొల్పోయారు.

మొత్తంగా రహదారిని పూర్తిస్థాయిలో పునర్నిర్మిస్తే తప్ప బాగుపడే పరిస్థితులు లేవు. వరదల అనంతరం కేంద్ర బృందం కూడా ఈ రహదారిని పరిశీలించి నివేదికలను కేంద్ర ప్రభుత్వానికి పంపించింది. అయినా ఇప్పటి వరకు ఎలాంటి ఫలితం లేకపోయింది. భద్రాచల రాములోరి కల్యాణ తరుణంలోనైనా ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి ఈ రహదారికి తక్షణ మరమ్మతులు చేపట్టాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. రహదారిని పూర్తిస్థాయిలో పునర్నిర్మించాలని కోరుతున్నారు.

సమీపిస్తున్న రాములోరి కల్యాణం

దక్షిణ అయోధ్యగా పేరుగాంచిన భద్రాచల రామయ్యను దర్శించుకోనే భక్తులు దూరప్రాంతాల నుంచి ఈ రహదారిలోనే ప్రయాణించాలి. భద్రాచలం నుంచి రాజమండ్రి, అమలాపురం, విశాఖపట్నం వెళ్లే ఆర్టీసీ బస్సులు ఈ రహదారిలోనే రాకపోకలు సాగాలి. హైదరాబాద్, గుంటూరు, విజయవాడ, వరంగల్, ఖమ్మం, కరీంనగర్, తిరుపతి వంటి ప్రాంతాలకు ఆర్టీసీ బస్సులు రాకపోకలు సాగుతాయి. అంటే ఈ ప్రాంతాల్లోని భక్తులందరూ ఈ దారిగుండానే రాబోవు భద్రాచలం రాముడి కల్యాణానికి హాజరుకావాల్సి ఉంది. కాని ఈ దారేమో నాటి వరదలతో పూర్తిగా దెబ్బతింది. రోడ్డుపై తారు లేచిపోయి పెద్దపెద్ద గోతులు పడ్డాయి. రోడ్డుకు ఇరువైపులా అప్రోచ్ రోడ్డు కొట్టుకుపోయింది.

కాలి నడకన భక్తులు..

ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి, కృష్ణ, గుంటూరు జిల్లాల నుంచి భద్రాచలం రామయ్యను దర్శించుకునేందుకు కాలినడకన వేలాదిమంది భక్తులు ఈ మార్గంలో వస్తుంటారు. కాళ్లకు చెప్పులు లేకుండా వారు భక్తిభావంతో పాదయాత్రగా భద్రాచలం వస్తుంటారు. గోతులతో కంకర తేలిన ఈ రహదారిలో భక్తులు పాదయాత్రకు నానా అగచాట్లు పడుతున్నారు. అధికారులు స్పందించపోవటంపై విమర్శలు వస్తున్నాయి.

రోడ్డుపై లారీలు నిలపొద్దు!



ఆయా విభాగాల ప్రతినిధులతో మాట్లాడుతున్న మణుగూరు డీఎస్పీ రవీందర్‌రెడ్డి

మణుగూరుటౌన్: సీఎస్పీ కాంటా వద్ద రోడ్డుపై, ఇసుక రీచ్‌ల వద్ద రోడ్డుపై లారీలు నిలపొద్దని ప్రత్యేక పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేసుకోవాలని మణుగూరు డీఎస్పీ రవీందర్‌రెడ్డి అన్నారు. గురువారం మణుగూరు-బీటీపీఎస్ రహదారిపై తరచూ ఏర్పడుతున్న ట్రాఫిక్ దృష్ట్యా బీటీపీఎస్ కోల్ ట్రాన్స్‌పోర్ట్ ఆర్ఐ, సింగరేణి ఎస్ఓ, కోల్ ట్రాన్స్‌పోర్ట్ అసోసియేషన్ సభ్యులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. బీటీపీఎస్ గేట్ నుంచి 400 మీటర్ల వరకు ఇరువైపులా పార్కింగ్ నిషేధించాలని సూచించారు. అవసరమైతే ప్రత్యేకంగా పార్కింగ్ స్థలాన్ని ఏర్పాటు చేసుకోవాలన్నారు. రాజుపేటకు వెళ్లే క్రాస్ రోడ్డు వద్ద సింగరేణి బొగ్గు లారీలకు అడ్డుగా ఏర్పడకుండా అక్కడ పార్కింగ్ చేయవద్దని, కేటాయించిన పార్కింగ్ స్థలాల్లో వాహనాలు ఉంచాలని సూచించారు. అయినప్పటికీ వాహనాలు రోడ్లపై ఉంచితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు. మణుగూరులో ఇటీవల ఇసుక రీచ్‌ల వద్దకు వచ్చే లారీలు రోడ్లపై పార్కింగ్ చేయకుండా పోలీసులకు సహకరించాలని సూచించారు. సమావేశంలో సీఐ సతీష్‌కుమార్, సెక్యూరిటీ ఆఫీసర్ శ్రీనివాస్, డి.నాయుడు, లారీ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

క్రైస్తవులపై దాడులు అరికట్టాలి



నిరసన తెలుపుతున్న అసోసియేషన్ సభ్యులు

మణుగూరురూరల్: క్రైస్తవులపై జరుగుతున్న దాడులను అరికట్టాలని, ప్రవీణ్ పగడాల హత్యకు కారకులైన వారిని శిక్షించాలని డిమాండ్ చేస్తూ యునైటెడ్ క్రిస్టియన్స్ అసోసియేషన్ మండల కమిటీ ఆధ్వర్యంలో గురువారం అంబేడ్కర్ సెంటర్‌లో కొవ్వొత్తులతో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా అసోసియేషన్ నాయకులు మాట్లాడుతూ.. గత రెండు రోజుల క్రితం రాజమండ్రిలో ప్రవీణ్ ప్రగడాలపై గుర్తుతెలియని దుండగులు దాడి చేసి ప్రమాదంగా చిత్రీకరించడం దారుణమన్నారు. దాడికి పాల్పడి వారిని పట్టుకుని కఠినంగా శిక్షించాలని, ఇలాంటి సంఘటనలు పునరావృతంగా కాకుండా ప్రభుత్వాలు తగు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు రెవ బి.విజ్ఞానరావు, ఉపాధ్యక్షుడు పాస్టర్ శ్యామ్, కార్యదర్శి పాస్టర్ జేమ్స్, సహాయ కార్యదర్శిగా పాస్టర్ శామ్యూల్, కోశాధికారి పాస్టర్ నెహెమ్యా, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

తొలగిన తాగునీటి సమస్య



తాగునీటి సరఫరాను పరిశీలిస్తున్న అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

ములకలపల్లి: ఎట్టకేలకు మండల పరిధిలోని సత్యంపేట వాసులకు తాగునీటి సమస్య తొలిగిపోయింది. గ్రామంలో 20 రోజులుగా నీటి సరఫరా నిలిచిపోగా.. 'సాక్షి'లో 'గిరిజనుల తాగునీటి వెతలు' శీర్షికన గురువారం కథనం ప్రచురితమైన విషయం విధితమే. స్పందించిన సంబంధిత శాఖ అధికారులు హుటాహుటిన మోటారు మరమ్మతులు చేపట్టారు. సాయంత్రంలోగా మోటారు ఏర్పాటు చేసి, నీటి సరఫరాకు ట్రయల్ రన్ వేశారు.

స్తంభాలొచ్చేశాయ్..

అశ్వారావుపేట: అశ్వారావుపేటలోని సెంట్రల్ లైటింగ్ పనులు నత్తనడకన జరుగుతున్న సంగతి తెలిసిందే. డివైడర్ నిర్మించి వదిలేశారు. అయితే గురువారం సెంటర్ లైటింగ్ నిమిత్తం వినియోగించే విద్యుత్ స్తంభాలు అశ్వారావుపేటకు చేరాయి. నత్తనడకన సాగుతున్నా.. త్వరలో అశ్వారావుపేట ప్రధాన రహదారి వెలుగులతో మిరుమిట్లు గొలపనుందన్నమాట. కాకపోతే దానికి ఎంతకాలం ఎదురు చూడాలో మరి.

ఇఫ్తార్ విందు ఏర్పాటు



ముస్లింలకు ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందు

అశ్వారావుపేటరూరల్: మండల పరిధిలోని వినాయకపురం కాలనీ గ్రామంలోని మసీదులో స్థానిక సీనియర్ బీఆర్ఎస్ పార్టీ నాయకులు బిర్రం వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. పవిత్రమైన రంజాన్ మాసంలో ఉపవాస దీక్ష పాటిస్తున్న ముస్లిం సోదరులకు ఈ విందును ఇవ్వగా.. అనంతరం ముస్లింలతో కలిసి ప్రత్యేక ప్రార్థనలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ముస్లిం కమిటీ సదర్ ఎస్‌కే సాజిద్, మహ్మద్ ఖాసీం, ఎస్‌డీ హఫీజ్, వలిపాషా, పాషా, అన్వర్, ఖాదర్, గ్రామస్తులు ఉప్పల ప్రసాద్, లోకం సాంబశివరావు, మురళి, వీరబాబు పాల్గొన్నారు.

చీరల పంపిణీ

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని పేద ముస్లిం మహిళకు ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా గురువారం చీరల పంపిణీ చేశారు. ప్రతి ఏడాది నిర్వహించే కార్యక్రమంలో భాగంగా మజీద్ ఏ జామాన్ మసీద్‌తో పాటు రాజుపేట కాలనీ బిలాల్ మసీద్ నందు 20మంది మహిళలకు చీరెల అందజేశారు. కార్యక్రమంలో ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ ఆర్గనైజర్ ఎస్‌కె.ఉస్మాన్, బక్షి, ఎస్‌కె.బాషా, ఎస్‌కె.జావీద్, బాబాజీ, వలీవుల్లా పాల్గొన్నారు.

వాటర్‌షెడ్ పథకంతో జీవనోపాధి



మామకన్ను గ్రామంలో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

గుండాల: పీఎంకేఎస్‌వై వాటర్ షెడ్ పథకం ద్వారా అందే జీవనోపాధి అవకాశాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డీఎల్‌పీఓ రమణ, ఏడీఏ తాతారావులు అన్నారు. వాటర్ షెడ్ యాత్ర కార్యక్రమాన్ని గురువారం కాచనపల్లి, మామకన్ను గ్రామాల్లో ప్రారంభించారు. ముందుగా క్రీడా పాఠశాలలో విద్యార్థులకు వ్యాస రచన, ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను అందించారు. యాత్ర కార్యక్రమంలో భాగంగా ఆయా గ్రామాల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వర్షాకాలంలో గుట్టల నుంచి, అడవుల నుంచి వర్షాలకు నీరు వృథాగా పోతుందని, రైతులు ఆ నీటిని కాలువల ద్వారా మళ్లించుకుని కుంటల్లో నిలువ చేసుకోవాలని సూచించారు. ఈ పథకం ద్వారా నాలుగు గ్రామాల్లో కుంటలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ సత్యనారాయణ, ఎంపీఓ శ్యామ్‌సుందర్, తహసీల్దార్ ఇమ్మానుయేల్, ఏపీఓ రవితేజ, కార్యదర్శులు మల్లేష్, రమేష్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో చేరిన వైద్య నిపుణులు

అశ్వారావుపేట: అశ్వారావుపేట ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో నలుగురు స్పెషలిస్టు వైద్యులు విధుల్లో చేరినట్లు ఆస్పత్రి సూపరింటిండెంట్ డాక్టర్ రాధా రుక్మిణి గురువారం తెలిపారు. మత్తు డాక్టర్, స్త్రీల సంబంధిత, పిల్లల, ఎముకల వైద్యులు విధుల్లో చేరారని, రోగులకు నిత్యం అందుబాటులో ఉంటారని ఆయన తెలిపారు.

రైతు వేదికలో చర్చాగోష్టి

ములకలపల్లి: మండలకేంద్రంలోని రైతువేదికలో రైతులకు, వ్యవసాయ శాస్త్రవేత్తలకు ఇష్టాగోష్టి కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు మండల వ్యవసాయాధికారి (ఎంఏఓ) అరుణ్‌బాబు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. కృషి విజ్ఞాన కేంద్రానికి చెందిన వ్యవసాయ శాస్త్రవేత్తలు ఈ కార్యక్రమానికి హాజరు కానున్నారని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

'ఉపాధి' కూలీలకు వితరణ

అశ్వారావుపేటరూరల్: మండల పరిధిలోని నారాయణపురం గ్రామ శివారులో ఉపాధి హామీ పథకం కింద మండు వేసవిలో పనులు చేస్తున్న కూలీలకు స్థానిక బీఆర్ఎస్ పార్టీ నాయకులు జక్కుల రాంబాబు వితరణ అందించారు. కూలీలు చేస్తున్న పని ప్రదేశానికి వెళ్లి వారికి మజ్జిగ ప్యాకెట్లు, కూల్ డ్రింక్స్‌ను పంపిణీ చేశారు.

గ్రీన్ చానల్ ద్వారానే చెల్లించాలి



ఎంపీడీఓకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

దుమ్ముగూడెం: పంచాయతీ కార్మికులకు గ్రీన్ చానల్ ద్వారా వేతనాలు చెల్లించాలని, మల్టీ పర్పస్ విధానాన్ని రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా కోశాధికారి జి.పద్మ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో ఎంపీడీఓ బద్ది రామకృష్ణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం అధికారంలోకి వస్తే గ్రామపంచాయతీ కార్మికులను పర్మినెంట్ చేస్తానని హామీ ఇచ్చిందని, ఆ హామీ అమలు కోసం అనేక పోరాటాలు చేసినప్పటికీ 15 నెలలు కావస్తున్న అమలు చేయడం లేదని విమర్శించారు. ప్రతి నెల వేతనాలు చెల్లిస్తామని హామీ ఇచ్చి ఫ్రీజింగ్‌లో పెడుతూ నెలల తరబడి వేతనాలు ఇవ్వడం లేదన్నారు. ప్రభుత్వం మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేసి కేటగిర్లవారీగా పనులు ఇవ్వాలని, కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యల పరిష్కారానికై ఏప్రిల్ ఒకటి, రెండు తేదీల్లో మండల కేంద్రంలో జరిగే ధర్నా కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్మికులందరూ పాల్గొని జయప్రదం చేయాలని కార్మికులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్మికుల మండల కార్యదర్శి నరేష్, అధ్యక్షులు వెంకటేష్, భవాని తదితరులు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ల ఎన్నిక



భద్రాచలంటౌన్: విజయం సాధించిన దేవదానం ప్యానల్ సభ్యులు



బద్దం శ్రీనివాస్‌రెడ్డి



మారం సతీష్‌కుమార్

దమ్మపేటలో సతీష్‌కుమార్..

దమ్మపేట: మండల కేంద్రం, దమ్మపేట శివారులోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టు వద్ద బార్ అసోసియేషన్ ఎన్నికను ఏకగ్రీవం చేశారు. గురువారం దమ్మపేట కోర్టులో విధులు నిర్వర్తిస్తున్న న్యాయవాదులు ఏర్పాటు చేసుకున్న సమావేశంలో 2025-26 సంవత్సరానికిగాను బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా మారం సతీష్‌కుమార్, ఉపాధ్యక్షుడిగా ముప్పిడి శ్యాంసుధాకర్, ప్రధాన కార్యదర్శిగా గొంది మురళీమోహన్, కార్యదర్శిగా లక్కినేని నరేంద్ర, కోశాధికారిగా సంజయ్ తదితర కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన బార్ అసోసియేషన్ సభ్యులకు, తోటి న్యాయవాదులు అభినందనలు తెలిపారు.

భద్రాచలంలో దేవదానం..

భద్రాచలంటౌన్: భద్రాచలం జ్యుడిసియల్ మెజిస్ట్రేట్ కోర్ట్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా కోట దేవదానం విజయం సాధించారు. స్థానిక కోర్టు ఆవరణాలో గురువారం జరిగిన బార్ అసోసియేషన్ ఎన్నికల్లో ప్రత్యర్థి టి.చైతన్యపై 7 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. వైస్ ప్రెసిడెంట్‌గా సున్నం రమేష్, జాయింట్ సెక్రెటరీగా పూసాల శ్రీనివాస చారి, కోశాధికారిగా పేరాల నాగరాజు, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రటరీగా బండి రాంప్రసాద్, లైబ్రరీగా చందా హనుమంతరావు, లేడి రెప్రెజెంటేటివ్‌గా పులుసు తరుణిలు కూడా విజయం సాధించారు. విజయం సాధించిన న్యాయవాదులకు భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్ రావు, సీనియర్ న్యాయవాదులు, జూనియర్ న్యాయవాదులు, కోర్ట్ సిబ్బంది, పట్టణ ప్రముఖులు శుభాకాంక్షలు తెలిపారు.

మణుగూరులో శ్రీనివాస్‌రెడ్డి

మణుగూరురూరల్: మండలంలోని మణుగూరు ప్రథమశ్రేణి జ్యుడిషియల్ కోర్ట్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా బద్దం శ్రీనివాస్‌రెడ్డి ఎన్నికయ్యారు. గురువారం కోర్ట్ ఆవరణలో బార్ అసోసియేషన్ ఎన్నికలు నిర్వహించారు. చిర్ర రవికుమార్ ప్రధాన కార్యదర్శిగా, దాసరి కవిత ఉపాధ్యక్షురాలిగా గెలుపొందారు. వీరికి న్యాయవాదులు ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. బార్ అసోసియేషన్ ఎన్నికల నిర్వహణ వీరమధుసూధన్, సహాయ అధికారిగా కె.శైలజలు వ్యవహరించారు. కార్యక్రమంలో న్యాయవాదులు తుళ్లూరి బ్రహ్మయ్య, చిర్ర సరస్వతి, లావణ్య, రత్నకుమార్, ప్రసాద్ రెడ్డి, రుద్ర వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదంపై పలువురి స్పందన

భద్రాచలం పట్టణంలో భవనం కూలిపోయి కార్మికులు మృతి చెందిన ఘటనపై పలు పార్టీల నాయకులు, సంఘాల బాధ్యులు స్పందించారు. ప్రభుత్వం బాధితులకు న్యాయం చేయాలని, బాధ్యులను శిక్షించాలని ఈ సందర్భంగా వారు కోరారు.



భద్రాచలంటౌన్: ప్రమాద స్థలాన్ని పరిశీలిస్తున్న సీపీఐ నాయకులు

భద్రాచలంటౌన్: ఘటనపై ప్రభుత్వం విచారణ జరిపించి కారకులపై తగిన చర్యలు తీసుకోవాలని, ప్రాణాలు కోల్పోయిన కార్మికుల కుటుంబాలకు నష్టపరిహారం చెల్లించి న్యాయం చేయాలని సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్‌కె.సాబీర్ పాషా అన్నారు. పట్టణంలోని బోనాలవారి వీధిలో నిర్మాణంలో ఉన్న భవనం కుప్పకూలిన ప్రదేశాన్ని గురువారం సీపీఐ ప్రతినిధి బృందం పరిశీలించి బాధిత కుటుంబాల వారిని పరామర్శించారు. అనంతరం ఆయన మాట్లాడారు. రావులపల్లి రవికుమార్, కంచర్ల జమలయ్య, భూక్య శ్రీను, ఎస్వీఎస్ నాయుడు, మా రెడ్డి శివాజీ, ఏపూరి వెంకటేశ్వరరావు, కంభం మెట్టు శ్రీనివాస్, రామారావు శోభన్, సాయిరాం, సాయి, శివ, మహేష్, ప్రశాంత్ పాల్గొన్నారు.

▶▶ బీఆర్ఎస్ పరిశీలన

సంఘటన స్థలాన్ని బీఆర్ఎస్ డివిజన్ నాయకులు గురువారం పరిశీలించి, బాధిత కుటుంబాలను పరామర్శించారు. ఈ సందర్భంగా డివిజన్ నాయకులు రావులపల్లి రాంప్రసాద్, మానె రామకృష్ణ మాట్లాడుతూ.. కార్మికులు మృతికి కారకులైన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి బాధిత కటుంబాలకు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.

▶▶ చర్యలు తీసుకోవాలి

భవనం కూలడంపై ఉన్నతాధికారుల విచారణ జరిపించి కారకులైన అధికారులపై కఠిన చర్యలు జరిపించాలని సేవాలాల్ సేన జిల్లా అధ్యక్షుడు ధరావత్ సురేష్ నాయక్ డిమాండ్ చేశారు. పట్టణంలోని సుందరయ్య నగర్ కాలనీలో మండల అధ్యక్షుడు వీరేందర్ నాయక్ అధ్యక్షతన గురువారం జరిగిన సేవాలాల్ సేన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఏజెన్సీలో పలు సంఘాలు వినతి పత్రాలు అందిస్తున్నప్పటికీ కొందరు అధికారులు పట్టించుకోకుండా బహుళ అంతస్థుల నిర్మాణాలకు అనుమతులు ఇస్తున్నారని ఆరోపించారు. మృతి చెందిన కార్మికుల కుటుంబాలకు ప్రభుత్వం తరఫున ఒక ఉద్యోగంతో పాటు కుటుంబానికి రూ.50 లక్షల ఎక్స్ గ్రేషియాను ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో లావుడియా వెంకటేష్ నాయక్, బానోతు నాగరాజు నాయక్, కిషన్ నాయక్, రమేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

▶▶ బాధితులను ఆదుకోవాలి

బూర్గంపాడు: మృతిచెందినవారి కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ డివిజన్ నాయకుడు పున్నంచంద్ డిమాండ్ చేశారు. గురువారం ఓ ప్రకటనలో బాధిత కుటుంబాలకు కోటిరూపాయల పరిహారమందించాలని కోరారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా బహుళ అంతస్తు నిర్మాణం చేపట్టిన యజమానిపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. బాధిత కుటుంబాలకు అతని వద్ద నుంచి కూడా కోటి రూపాయల పరిహారం ఇప్పించాలని డిమాండ్ చేశారు.

▶▶ పరిహారం చెల్లించాలి

దమ్మపేట: చనిపోయిన మృతుల కుటుంబ సభ్యులకు కోటి రూపాయల పరిహారం చెల్లించి, ప్రభుత్వ ఉద్యోగాలు ఇవ్వాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ పార్టీ జిల్లా నాయకులు అమర్లపూడి రాము ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రం, దమ్మపేటలో నిర్వహించిన మాస్‌లైన్ పార్టీ సమావేశంలో రాము మాట్లాడుతూ... భవన నిర్మాణానికి కారకులు, అనుమతులు ఇచ్చిన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పందూరి వీరబాబు, నాగమణి, సుజాత, నాగవల్లి, ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం ఆదుకుంటుంది..

భద్రాచలంటౌన్: నిర్మాణంలో ఉన్న భవనం కుప్పకూలిన ప్రమాదంలోని మృతుల కుంటుంబాలను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందని రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ డైరెక్టర్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. ప్రమాదం జరిగిన ప్రదేశాన్ని ఆయన గురువారం పరిశీలించారు.